

# యూఎఫ్ఓ

గ్రహాంతరవాసులు అనగానే ఎగిరే పళ్లాలు (ఫ్లయింగ్ సాసర్స్) గుర్తుకొచ్చి తీరాతాయి. అవి వారి వాహనాలు కదా! ఆకాశంలో వింత ఆకారం ఏది కనిపించినా దాన్ని యూఎఫ్ఓ (అన్ఐడెంటిఫైడ్ ఫ్లయింగ్ ఆబ్జెక్ట్) గా పేర్కొంటారు. వీటిలో భాగమే ఫ్లయింగ్ సాసర్స్. అడపాదడపా పేపర్లలో, సోషల్ మీడియాలో కనిపించి దడపుట్టించే ఈ యూఎఫ్ఓల వెనుక కారణం ఏమిటి. అవి ఏలియన్స్ వాహనాలు అన్నది ఓ నమ్మకం మాత్రమే. హేతువాదుల ప్రకారం అవి...



- రక్షణ దళాలు గూఢచర్యం లేదా పరిశోధన కోసం ప్రయోగించే వాహనాలు.
- గుండ్రంగా ఉండే మెరుపులు (ప్లాస్మా లైట్నింగ్).
- వాతావరణంలోని అయస్కాంత క్షేత్రాల వల్ల ఏర్పడే వెలుగు.
- తక్కువ ఎత్తులో ఉండే మబ్బులు.
- భూవాతావరణంలో ప్రవేశించిన ఉల్కలు.
- మీథేన్లాంటి వాయువుల మంటలు.

ఇవే కాకుండా నిద్ర సరిగా లేకపోవడం, మాస్ హిస్టీరియా, గట్టిగా నమ్మింది కళ్ల ముందు మెదిలే భ్రాంతి... లాంటి మానసికమైన కారణాల వల్ల కూడా మనకు ఆకాశంలో వింత ఆకారాలు కనిపించవచ్చని కొట్టిపడేస్తున్నారు. ఇవేవీ కాదు, అవి ఏలియన్స్ వాహనాలే అని బలంగా నమ్మేవారూ ఉన్నారు. అమెరికా ప్రభుత్వం సైతం 2021లో 'కచ్చితంగా గుర్తించలేని కొన్ని వింత వస్తువులు ఆకాశంలో ఎగరడాన్ని గమనించాం' అని ఒప్పుకొంది.

## ఇంతకీ ? ఎవరు వాళ్లు!

ఒకవేళ మనలో కొందరికి వింత ప్రాణులు లేదా వాహనాలు కనిపిస్తే అవి నిజంగానే గ్రహాంతరవాసులా లేక ఇంకేదన్నా కారణం ఉందా అన్న ప్రశ్నకు కూడా కొన్ని ఆసక్తికరమైన నమ్మకాలు వినిపిస్తున్నాయి.

1 భవిష్యత్తులో ఉన్న మనుషులే టైం ట్రావెల్ చేసి వెనక్కి వచ్చి మనల్ని పరిశీలిస్తున్నారని ఓ నమ్మకం.

2 పారలల్ యూనివర్స్! అంటే ఒకే మనిషి వేర్వేరు చోట్ల జీవించడం అనే ప్రక్రియ వల్ల ఏర్పడే గందరగోళం.

3 ఏలియన్స్ ఉన్నారు కానీ వారు నిజంగా రావడం లేదు. అధునాతన త్రీడీ సాంకేతికత ద్వారా వారి ప్రతిరూపాలను మాత్రం ఇక్కడికి పంపిస్తున్నారు.

4 పిశాచగణాలు లేదా దేవతలను పొరపాటున చూసినప్పుడు వారిని ఏలియన్స్ అనుకుంటున్నాం.

ఏలియన్స్ ఉన్నారా లేరా అనే చర్చ మనిషి ఉన్నంతకాలం నడుస్తూనే ఉంటుంది! ఒకవేళ వాళ్లు ఉంటే ఎందుకలా చుట్టపుచూపుగా వచ్చిపోతున్నారనే అనుమానమూ కలుగుతుంది. దానికి కూడా సిద్ధాంతాలు వెలువరించేశారు. ఏలియన్స్ కనుక మనుషులకు దగ్గరైతే... వారిని నాశనం చేసేస్తామనో, బానిసలుగా మార్చుకుంటామనో భయంతో వారు మనకు దూరం దూరంగా ఉంటున్నారట. మొత్తానికి మనుషులంటే ఏలియన్స్ కూడా భయపడుతున్నారన్నమాట. కాబట్టి ఈసారి అవి మనకు కనిపిస్తే కాస్త మచ్చిక చేసుకునే ప్రయత్నం చేద్దాం.